# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 18-06-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల సాగుపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు.**

2. **గత 12 ఏళ్లలో దేశంలో మౌలిక వసతుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత లభించిందని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు.**

3. **వర్షాకాలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలంగాణా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు.**

4. **ఆంధ్రప్రదేశ్ అభివృద్ధితో పాటు అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.**

==========================

రాష్ట్రంలో పరిపాలనను మరింత సమర్ధవంతంగా నిర్వహించేందుకు అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు తప్పనిసరిగా చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం ఆర్టీజీఎస్‌లో వివిధ శాఖల పనితీరుపై నిన్న నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, జూలై నెల నుంచి ప్రతీ అధికారి వారానికి మూడు రోజులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని సూచించారు. అలాగే వ్యవసాయ, ఉద్యాన, ఆక్వా రంగాలపై జరిగిన సమీక్షలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల సాగుపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. ప్రకృతి సేద్యాన్ని మరింత విస్తరించడంతో పాటు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పప్పు దినుసుల సాగును ప్రోత్సహించాలని సూచించారు.

---

ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేలా యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఈ నెల 21న నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమ ఏర్పాట్లపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సంబంధిత అధికారులతో నిన్న ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ సంజీవని కార్యక్రమంతో అనుసంధానం చేసి యోగాను ఇంటింటికీ తీసుకువెళ్లేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ నెల 20న

ఉండవల్లి గుహల సమీపంలో నిర్వహించే యోగా కార్యక్రమంలో ప్రముఖ యోగా గురువు బాబా రాందేవ్ తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొంటారు. అలాగే 21న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు.

-------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ 12 ఏళ్ల పాలనలో దేశంలో మౌలిక వసతుల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత లభించిందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా ఉండి రైల్వే పైవంతెన ఆర్‌ఓబీ నిర్మాణ పనులను ఆయన నిన్న పరిశీలించారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ, ఉండి రైల్వే స్టేషన్‌లో మచిలీపట్నం-విశాఖపట్నం ఎక్స్ ప్రెస్ రైలుకు హాల్ట్ కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. పీఎం గతి శక్తి పథకం కింద నరసాపురం పార్లమెంట్ పరిధిలో ఇప్పటికే నాలుగు ఆర్‌ఓబీలు మంజూరయ్యాయని వివరించారు. అనంతరం ఉండి బస్టాండ్ వద్ద 'అమ్మ పేరుతో ఒక మొక్క' కార్యక్రమంలో భాగంగా ఆయన మొక్కను నాటారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ లోని కాకినాడ జిల్లా తుని మండలం సీహెచ్ ఆగ్రహారంలో అదృశ్యమైన చిన్నారి జ్ఞానేశ్వరి కుటుంబ సభ్యులను హోంమంత్రి అనిత నిన్న పరామర్శించారు. చిన్నారి తల్లిదండ్రులను కలసి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా పాప అదృశ్యమైన కేసు పురోగతిపై హోంమంత్రి సమీక్ష నిర్వహించారు. అన్ని కోణాల్లో దర్యాప్తును మరింత వేగవంతం చేయాలని హోంమంత్రి అధికారులను ఆదేశించారు. సాంకేతిక ఆధారాలతో పాటు ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో గాలింపు చర్యలు చేపడుతున్నాయని ఈ సందర్భంగా మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ..25... సెకన్లు

-------------------------

తెలంగాణలో రానున్న పదేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కార్యాచరణ రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధలో సంబంధిత ఉన్నతాధికారులతో.. విద్యుత్ రంగ పనితీరుపై ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, వర్షాకాలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. భారీ వర్షాలు, ఈదురు గాలుల కారణంగా సమస్యలు ఏర్పడితే వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం రుషికొండలో నిర్మించిన భవనాల వినియోగంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం నిన్న సమావేశమైంది. సమావేశం అనంతరం ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాత్రికేయులతో మాట్లాడుతూ, రుషికొండలోని నిర్మాణాలను పర్యాటక రంగ అభివృద్ధికి వినియోగించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ప్రజల సూచనలు తీసుకొని ఈ అంశంపై ఒక నివేదికను త్వరలో ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలుపుతూ,

వాయిస్..30.. సెకన్లు

-------------------------

ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ అడ్వాన్స్ డ్ సప్లిమెంటరీ, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షల ఫలితాలు ఈరోజు విడుదల కానున్నాయి. మే 21 నుంచి జూన్ 5 వరకు నిర్వహించిన ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్ డ్ సప్లిమెంటరీ, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షల ఫలితాలను ఈరోజు మధ్యాహ్నం 12 గంటలకు విడుదల చేస్తామని ఇంటర్మీడియట్ విద్యా మండలి వెల్లడించింది. ఈ ఏడాది నుంచి ఇంటర్ రెండవ సంవత్సరం విద్యార్థులకు కూడా మార్కుల మెరుగుదల కోసం ఇంప్రూవ్‌మెంట్ పరీక్ష రాసే అవకాశం కల్పించారు. విద్యార్థులు తమ ఫలితాలను ఇంటర్మీడియట్ విద్యా మండలి అధికారిక వెబ్‌సైట్ bie.ap.gov.inలో పరిశీలించవచ్చని అధికారులు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధితో పాటు అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మార్కాపురంలో నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

ఉపరితల ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో ఈరోజు అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది.

అలాగే తెలంగాణలోనూ పలు జిల్లాల్లో ఈరోజు ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం పారదర్శకంగా నిర్వహించాలని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ఎన్నికల సంఘాన్ని కోరారు. అనంతపురం జిల్లా, శింగనమలలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన నిన్న మాట్లాడుతూ, ఎస్.ఐ.ఆర్ పై కొన్ని రాజకీయ పార్టీలు ఓటర్ల వివరాలను సేకరిస్తున్నాయనే ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పందించాలని డిమాండ్ చేశారు.

=====================